క్లుప్తంగా

హెల్మెట్ లేకపోతే జరిమానా



కంభం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని.. లేకపోతే జరిమానా విధిస్తామని ఎస్సై ఎం.మాధవరావు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలో కంభం–కనిగిరి రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ఆటో డ్రైవర్‌లు నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద ఇర్లపాడు గ్రామంలో అంకమ్మతల్లి తిరునాళ్ల ఘనంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా ప్రారంభమై అమ్మవారికి వార్లు పోసుకుంటూ నైవేద్యం అందిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఆదివారం పొంగళ్లతో తిరునాళ్ల ముగుస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏవో



ఏవో కాశీవిశ్వనాథ్‌ను అభినందిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల వ్యవసాయాధికారిగా ఐ కాశీవిశ్వనాథ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఈవోగా పనిచేసిన యుగంధర్ రెడ్డి టంగుటూరు మండలానికి బదిలీ అయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఏవోకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్రపు వాహనంపై నారసింహుడు



గుర్రపు వాహనంపై నారసింహుడు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహాల క్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చోరసంవాదం కార్యక్రమంలో భాగంగా నారసింహుడు గుర్రపువాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చప్పరసేవలో భాగంగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

మాలకొండ ఆదాయం రూ.17 లక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం శనివారం రూ.17,08,230 వచ్చినట్లు ఆలయ ఈవో కే సాగర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.19,280, తలనీలాలు రూ.79,475, ప్రత్యేక దర్శనం రూ.5,04,800, రూమ్ అద్దెలు రూ.29,410, లడ్డు ప్రసాదాలు రూ.2,51,160, అన్నదారం రూ.7,66,355 ఇతర విరాళాలు కలిపి ఆదాయం రూ.17,08,230 వచ్చినట్లు ఆయన తెలిపారు.

కోవూరు పశువైద్యాధికారిగా శ్రీకాంత్



బాధ్యతలు స్వీకరించిన వైద్యుడు శ్రీకాంత్

కందుకూరు రూరల్: మండల పరిధిలోని కోవూరు పశువైద్యాధికారిగా వై.శ్రీకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. లింగసముద్రం మండలం వీఆర్.కోటలో పని చేస్తూ బదిలీపై కోవూరు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్.సుధాకర్ కందుకూరు మండలం మాచవరం పశువైద్యాధికారిగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పశువులకు పశువైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. గోకులం షెడ్లు, పశుగ్రాసం, పశువులకు అంటువ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు చేయించి, పశుపోషకులకు ఎప్పుడూ అదుబాటులో ఉంటామని చెప్పారు.

మురికి కూపాలు.. చెత్త దిబ్బలు !





మురికి నీరుతో పొంగుతున్న ప్రధాన కాలువ

- రెండు నెలలైనా మరమ్మతులకు నోచుకోని 'కాంపాక్టర్'
- కాలువలో ఎక్కడికక్కడ పూడిక, చెత్తతో నిండిన రోడ్లు
- అధ్వాన పారిశుధ్యంపై మండిపడుతున్న ప్రజలు
- నిద్రమత్తులో మున్సిపల్ అధికారులు

కనిగిరిరూరల్:

స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫొటోలకు పోజులివ్వడానికి మాత్రమే పనికి వస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు.. చేసే పనులకు పొంతన అసలు ఉండదు. ఏ సందులో చూసినా.. గొందిలో చూసినా చెత్తే. వీధి చివరలో చెత్త గుట్టలు. కాలువల్లో కదలని మురుగు. ఇదీ కనిగిరి మున్సిపాలిటీ దుస్థితి. కారణాలు ఏమైనా సుమారు 2 నెలల నుంచి కాంపాక్టర్ వాహనం పని చేయక పోవడం.. మున్సిపల్, సచివాలయ శానిటరీ అధికారులు, సిబ్బంది సమన్వయలోపంతో పట్టణ ప్రజలు దుర్గంధంలో అల్లాడుతున్నారు. కాలువల్లో మురికినీరు కదలక పోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీలో సుమారు 20 వార్డులు ఉండగా, 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. ప్రతినిత్యం 20 వార్డుల నుంచి సుమారు 14 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. అయితే చెత్తను తరలించి తీసుకెళ్లే కంపాక్టర్ వాహనం గత 20 రోజుల నుంచి నిలిచి పోయింది. దీంతో కనిగిరిలోని ప్రధాన వీధుల్లో చెత్త తరలింపు అరకొరకగా మారి ప్రధాన రోడ్లు, వీధులు చెత్తమయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..

ఆదాయ వనరులపై దృష్టి సారించే మున్సిపల్ అధికారులు, ప్రజారోగ్యంపై దృష్టి పెట్టడం లేదు. శరవేగంగా పెరుగుతున్న మున్సిపాలిటీలో పాలన సౌలభ్యానికి అనుగుణంగా.. పారిశుధ్య చర్యల కనుగుణంగా పరికరాలు లేవు. డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా కనిగిరి మున్సిపాలిటీకి కేవలం ఒక కంపాక్టర్ మాత్రమే ఉండగా నాలగు చెత్త ట్రాక్టర్లు ఉన్నాయి. కంప్యాక్టర్ వాహనం మరమ్మతులకు గురై రెండు నెలలు అయినా ప్రత్యామ్నయ చర్యలు చేపట్టలేదు. వాస్తవ పరిస్థితుల్లోకి వెలితే వాహనం మరమ్మతుకు అయ్యే నగదును మున్సిపల్ శాఖ చెల్లించడంలో జాప్యం వల్లే ఈ దుస్థితి. పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు కనీసం ప్రజా ఆరోగ్యంపై స్పందిచక పోవడం పట్ల పట్టణ ప్రజలు ఛీదరించుకుంటున్నారు. ఇళ్లలోని చెత్తను వారంలో ఒక రోజు కూడా తీసుకెళ్లడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇక పలువార్డుల్లో మురికి కాలువలు తీయక పోవడంతో చెత్త చెదారం నిండి మురికి నీటితో కాలువలు దుర్గంధ నీరు రోడ్లపై పొంగిపొర్లుతున్నారు. ప్రధానంగా పట్టణంలోని 13, 10 వార్డుల్లో, శివారు కాలనీల్లో పరిస్థితి మరింత అధ్వానం. ఇక ప్రధాన సెంటర్లలో, డిపో ఏరియాలో సీపీఐ కార్యాలయం వద్ద, క్లబ్ రోడ్డులో చెత్త కుండీలు నిండి రోడ్లపై ముక్కులు మూసుకుని నడిచే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు కనిగిరి స్వచ్ఛ కనిగిరిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గుట్టలుగా పడి ఉన్న చెత్త

అన్నదాత సుఖీభవా ఈ-కేవైసీ పూర్తి చేయాలి



ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది అన్నదాత సుఖీభవా ఈ –కేవైసీ త్వరగతిన పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని వాసేపల్లిపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి యుగంధర రెడ్డి అధ్యతన నిర్వహించిన ఈ– కేవైసీ అవగాహన సదస్సులో శనివారం ఆయన పాల్గొని సలహాలు, సూచనలు జారీ చేశారు. సుఖీభవా అర్హుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో ఉందని వారు వీఏఏల వద్ద ఆధార్‌తో ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతానికి సొంత భూములు ఉన్న రైతులకు, అనంతరం కౌలు రైతులకు కూడా ఈ పథకం మంజూరు అవుతుందన్నారు. మండలంలో 5042 మంది అర్హులు జాబితాలో ఉన్నారని, ఈ–కేవైసీ ప్రక్రియ 3,4 రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్

కొండపి: ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పెరిదేపి గ్రామంలో ఉపాధి కూలీలు పని వద్దకు వెళ్లి వారి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ఉపాధి కూలీలకు వేతనాలు 15 రోజుల లోపల ఇవ్వాలని, అలా ఇవ్వని పక్షంలో వడ్డీతో కలిపి ఉపాధి కూలీలు వేతనాలు పంపిణీ చేయాన్నారు. ఇది చట్టం చెప్తున్న మాట అని దానిని అమలు చేసే విధంగా విధంగా అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అంగలకుర్తి బ్రహ్మయ్య మాట్లాడుతూ పేమెంట్ స్లిప్ ఇవ్వాలని, 2006లో ఇచ్చిన పనిముట్లు తప్ప ఇప్పటివరకు పనిముట్లు ఇవ్వలేదని, తక్షణమే ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామ్యూల్, ఆశీర్వాదం, ఆదాం, తిరుపతి వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్

టంగుటూరు: పొగాకు రైతులు పచ్చిరొట్ట విత్తనాలు నాటుకుంటే భూములు సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రంలో రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పచ్చిరొట్ట విత్తనాలు ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. స్థానిక వేలం కేంద్రానికి చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 974 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 782 కొనుగోలు జరగగా, 192 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 280, కనిష్ట ధర రూ. 180 పలకగా, సరాసరి రూ. 251.41 ధర పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

715 బేళ్ల కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 715 బేళ్లు కొనుగోలైనట్లు వేలం నిర్వహణ ధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెదకళ్లగుంట, నరసరాజుపాలెం, అయ్యపరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 861 బేళ్లను వేలానికి తీసుకోని వచ్చారు. అందులో 715 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 146 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ 280, కనిష్ఠ ధర కేజీ రూ 180, సరాసరి ధర కేజీ 245.37గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో మనసుకు ప్రశాంతత



కే.ఉప్పలపాడులో యోగా చేస్తున్న సచివాలయ సిబ్బంది, ప్రజలు

కొండపి: యోగాతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో భవన సమావేశ హాలులో ఏర్పాటు చేసిన యోగ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా ఎంతో ముఖ్యమని, ప్రతిరోజు యోగా చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒత్తిడి వలన అనేక సమస్యలతో హాస్పటల్ బారిపాడుతున్నారని, అనారోగ్య సమస్యలను నయం చేసుకోవడానికి ఎంతో ఖర్చులు చేస్తున్నామని చెప్పారు. యోగాతో కొంత వరకు మన ఆరోగ్యం మనమే కాపాడుకోవచ్చన్నారు. యోగా కార్యక్రమం మండలంలోని అన్ని సచివాలయాలలో సచివాలయ సిబ్బంది గ్రామస్తులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

నిత్య యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సీఎస్‌పురం(పామూరు): నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కే.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వారి వయసును బట్టి కొన్ని నిముషాల పాలు ప్రతిరోజు యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



సీఎస్‌పురంలో యోగా నిర్వహిస్తున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి



పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐ

పామూరు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు యోగా అలవర్చుకుని నిత్యం దానిని అనుసరించాలని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, సీఐ ఎం.భీమానాయక్, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్యలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో శనివారం ప్రత్యేక యోగా కార్యక్రమం, శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై టి.కిషోర్‌బాబు, డాక్టర్ గద్దే ఏడుకొండలు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, పీఎస్ జి.అరవిందారెడ్డి, వీఆర్ఓ సరస్వతి, డి.వి.మనోహర్, ఇర్రి కోటిరెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వెలిగొండ పూర్తిచేయాలని నిరసన



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): పశ్చిమ ప్రాంతం ఎడారి కాకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కేవై.పెదమస్తాన్ అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని డీటీపల్లె గ్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గువ్వల నరసింహులు, మౌలాలి, గోవిందు, ఏసుపాదం, పలువరు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం మానవత్వానికి ప్రతీక



రక్తదాతలను సన్మానిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: రక్తదానం మానవత్వానికి ప్రతీక అని.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసిన ప్రాణ దాతలుగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ ఆఫీసులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 54 సార్లు రక్తదానం చేసిన ముత్యాల శ్రీనివాసులరెడ్డి, 40 సార్లు రక్తదానం చేసిన వర్రా చిన సింగారెడ్డి, 18 సార్లు రక్తదానం చేసిన మారెళ్ల వెంకట కృష్ణారెడ్డిల సేవా దృక్పదాన్ని, మానవత్వాన్ని కొనియాడారు. అనేక మార్లు రక్తదానం చేసిన వీరు పలువురికి ఆదర్శనీయమని తెలిపారు. అనంతరం రక్తదాతలను సన్మానించారు. కార్యక్రమంలో మంద్రు రమేష్‌బాబు, నవకుమార్, థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, ఏఎంసీ మాజీ డైరక్టర్ బొట్టు శ్రీను, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు ఎస్‌కే నాగూర్‌బీ, మద్దిశెట్టి భారతి తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

కొండపి: అర్హులైన ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ పి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు 250 యూనిట్లు వినియోగించుకునే ప్రతి ఒక్కరూ సోలార్ యూనిట్ బిగించుకొని ప్రభుత్వానికి సహకరించాలని, ఈపథకం ద్వారా మూడు కిలో వాట్స్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు, రాష్ట్ర ప్రభుత్వం 20 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఏసీలు ఉన్న ప్రతి ఒక్కరూ అడిషనల్‌లో జూన్ 30 లోపల చెల్లించితే 50 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. జూన్ 30 తరవాత పూర్తి నగదు కట్టాల్సి ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

పొగాకును పరిశీలించిన కేంద్ర బోర్డు అధికారులు



పొగాకును పరిశీలిస్తున్న కేంద్ర టొబాకో బోర్డు అధికారి కెసాంగ్ యాంగ్జోమ్

సింగరాయకొండ: మండల కేంద్రంలోని బీకే థ్రెషర్స్ కంపెనీలో గ్రేడింగ్ చేసిన వివిధ రకాల పొగాకు నమూనాలను శనివారం కేంద్ర టొబాకో బోర్డుకు చెందిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ కేసాంగ్ యాంగ్జోమ్ షెర్పా స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు ప్రాసెసింగ్ ప్రక్రియను ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించి నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీలో పొగాకును ఏవిధంగా వివిధ దశల్లో ప్రాసెసింగ్ చేస్తారో గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ డివిజన్ జనరల్ మేనేజర్ ఎం ప్రభాకరరావు వివరించారు. ఎమ్మెల్యే బీఎస్ విజయకుమార్, ఐటీబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ., గుంటూరు టుబాకో బోర్డు అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ స్థాపనే జేవీవీ లక్ష్యం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధనుంజయుడు, జేవీవీ నాయకులు

కనిగిరిరూరల్: శాస్త్రీయ సమాజ స్థాపనలో జనవిజ్ఞాన వేదిక కృషి ప్రశంసనీయమని డాక్టర్ మర్రి ధనుంజయుడు, జేవీవీ రాష్ట్ర నాయకులు వీ మాలకొండారెడ్డిలు అన్నారు. స్థానిక సాయి సిద్ధార్థ హాస్పిటల్ ఆవరణలో శనివారం జేవీవీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మూఢ నమ్మకాలను పారదోలేందుకు, శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జేవీవీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర, జిల్లా నాయకులు జీ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కే ఖాజాహుస్సేన్, మేడం కోటిరెడ్డి, ఎస్‌కే షరీఫ్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

పామూరు: మండల కేంద్రం పామూరులో రోడ్డు, కాల్వ ఆక్రమణల తొలగింపు, సైడుకాల్వల ఆధునికీకరణ పనులను శనివారం పంచాయతీ సిబ్బంది ప్రారంభించారు. ఈసందర్భంగా కనిగిరి రోడ్డు, సీఎస్‌పురం రోడ్డులలో ఉన్న ఆక్రమణలను దుకాణందారులే స్వచ్ఛందంగా తీసుకుంటుండగా, కాల్వలపై ఉన్న చిన్న చిన్న కట్టడాలను పంచాయతీ పీఎస్ జి.అరవిందారెడ్డి ఆధ్వర్యంలో జేసీబీలతో తొలగించారు. ఎలాంటి ఆటంకాలు, అలజడులు, ట్రాఫిక్‌కు ఎలాంటి అవరోధం లేకుండా సీఐ యం.భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బూచేపల్లికి నోటీసులు ఇవ్వడం దారుణం

సింగరాయకొండ: పొగాకు రైతుల కష్టాలను తెలుసుకోవడానికి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు వచ్చినపుడు పచ్చమూకలు అల్లర్లు సృష్టిస్తే పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని అల్లర్లకు బాధ్యులను చేస్తూ పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వారే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని హెచ్చరించారు.